క్లుప్తంగా

శ్రీనివాస్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఎకనావిఎక్స్ విభాగం పరిశోధకుడు రామిశెట్టి శ్రీనివాస్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. అగ్రో ఎకనామిక్ కండిషన్స్ ఆఫ్ ట్రైబల్స్ ఇన్ తెలంగాణ స్టేట్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు యానాది అండ్ ఎరుకల కమ్యూనిటీస్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి రామిశెట్టి శ్రీనివాస్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఎకనామిక్స్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ రాధాకృష్ణ పర్యవేక్షణలో రామిశెట్టి శ్రీనివాస్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

ప్రత్యేక అలంకరణలో మల్లన్న



కాజీపేట: కాజీపేట భ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవాలయంలో కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని మహాదేవుడిని భక్తులు ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన పూజారి ఐనవోలు ప్రవీణ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో మల్లన్నకు అభిషేకాలు, అర్చనలు జరిపించారు. ప్రత్యేక అలంకరణలోని స్వామిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయంలో మహిళలు దీపోత్సవం నిర్వహించి తమ భక్తిప్రవత్తులను చాటుకున్నారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులతో పాటు శివశక్తి యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి



మాట్లాడుతున్న హనుమంతరావు

ఖిలా వరంగల్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలో సర్వముఖాభివృద్ధి జరిగిందని కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు వీ.హనుమంతరావు తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి ఏమిటో పాలకులు చెప్పాలని సవాల్ విసిరారు. కేసీఆర్ పాలనతో ప్రజలు విసిగిపోయారని, ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించి తిరిగి అధికారంలోకి రావడం ఖాయమైందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ 39వ డివిజన్ లక్ష్మీనగర్‌లో ప్రచార రథంపై స్థానిక ప్రజలను ఉద్దేశించి ఆయన ఆదివారం మాట్లాడారు. ఫాంహౌస్‌లో పడుకొని పాలన సాగించే కేసీఆర్‌కు ప్రజలు ఓటుతో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కుటుంబ పాలన చేస్తూ రాష్ట్రాన్ని అప్పులోకి నెట్టిన ఘనత ఆయనదేనని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యాన్ని సైతం ఖూనీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాల అమలుతోపాటు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టనున్నట్లు వివరించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ప్రజలు పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో మీసాల ప్రకాశ్, కత్తెరశాల వేణు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

నర్సంపేట: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్ అధ్యక్షతన ఆదివారం ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు, మహిళా నాయకురాలు, యువజన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



ధాన్యాన్ని విక్రయిస్తున్న రైతులు

సంగెం: రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ఏఈఓ లావణ్య అన్నారు. కాపులకనిపర్తి సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని కాపులకనిపర్తి, గవిచర్ల, షాపూర్, తీగరాజుపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దళారీ వ్యవస్థను అరికట్టి మద్దతు ధరలు అందించేందుకే సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలతో కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి రైతులు మద్దతు ధర క్వింటాల్‌కు ఏ గ్రేడ్‌కు రూ 2,203లు, కామన్ రకానికి రూ 2,183లు పొందాలన్నారు. కార్యక్రమంలో సీఈఓ రమణాచారి, తదితరులు పాల్గొన్నారు.

కోతులతో ఉక్కిరిబిక్కిరి

- భయంతో వణికిపోతున్న నగరవాసులు
- వానరాలను నియంత్రించడంలో గ్రేటర్ అధికారుల నిర్లక్ష్యం
- మూడు నెలలుగా పట్టుకునే నాథుడే కరువు



మట్టెవాడలో దుకాణం ఎదుట కూర్చున్న కోతుల గుంపు



చెట్టు కింద సేదదీరుతున్న వానరాలు

వరంగల్ అర్బన్: కోతుల గుంపులు నగరంలో హల్‌చల్ చేస్తున్నాయి. వనారణ్యం నుంచి జనారణ్యంలోకి వస్తున్న కోతులు ఇళ్లలోకి చొరబడి నానా వీరంగం సృష్టిస్తున్నాయి. వాటి ధాటికి పిల్లలు, పెద్దలు భయంతో వణికిపోతున్నారు. రోడ్లు, భవనాలు, గోడలపై ఉంటూ మరీ ఎదురుదాడికి దిగుతూ భయపెడుతున్నాయి. తలుపులు తెరిచి ఉన్న ఇళ్లలోకి చొరబడి ఆగమాగం చేస్తున్నాయి. దాంతో కోతుల బెడద భరించలేకపోతున్నామంటూ బల్దియా అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లకు ఫిర్యాదులు చేసినా వారు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. కోతుల సృష్టిస్తున్న సమస్యలతో ప్రజలు వణికిపోతూ గాయాల బారిన పడుతూ, ఆస్పత్రుల పాలవుతున్నారు.

మూడు నెలలుగా నిలిచిన కోతుల పట్టివేత

మూడు నెలలుగా నిలిచిపోయిన కోతులు పట్టివేత టెండర్ పేరిట మూడు నెలలుగా నగరంలో కోతులను పట్టుకోవడం నిలిపివేశారు. టెండర్ కొత్త కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకోవడం, సిబ్బంది నిర్లక్ష్యం, అధికారుల పట్టింపుల లేనితనంతో నగరంలో ఒకటి, రెండు కాదు వందలాది కోతులు నగరంలో సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వానరులు కనిపించినా, అరిచినా చాలు వామ్మో కోతులు అంటూ జనం వణికిపోతున్నారు. కోతులను కట్టడి చేయకపోవడంతో వాటి సంఖ్య రెట్టింపవుతోంది.

ఎక్కడి సమస్య అక్కడే..

కాంట్రాక్టర్‌కు టెండర్ అప్పగిస్తే పెద్ద బోన్లు, బాక్స్ బోన్లు పెడతారు. బోనులో కోతులు పడేందుకు అరటిపండ్లు, పల్లీలు ఎరగా వేస్తారు. వరుసగా రెండు రోజులపాటు వాటిని తినేందుకు కోతులు వస్తాయి. మూడోరోజు బోనులో చిక్కుతాయి. ఇలా పట్టుకున్న వానరులను వారానికొకసారి నగరానికి దూరంగా భూపాలపల్లి, కాళేశ్వరం, ఏటునాగారం, పాకాల, కొత్తగూడెం అడవుల్లో వదిలిపెడతారు. అందుకోసం ప్రత్యేకంగా వాహనాన్ని బల్దియా సమకూరుస్తోంది. ఇలా కోతులను పట్టే కార్యక్రమం కొనసాగుతోంది. కానీ, నగరంలో కోతుల సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది.

ఎక్కడ చూసినా కోతులే..

ట్రైసిటీలో ఏ ప్రాంతంలో చూసినా కోతుల గుంపే కనబడుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హఠాత్తుగా గుంపులుగా వచ్చి ఇంట్లోని వస్తువులు, తినుబండారాలను ఎత్తుకెళ్తున్నాయని జనం వాపోతున్నారు. అడ్డుగా వెళ్తే దాడి చేసి గాయపరుస్తున్నాయని చెబుతున్నారు. ఉదయం వేళల్లో ఇళ్ల ముందు నీళ్లు చల్లుకొని, ముగ్గులు వేయడానికి కూడా మహిళలు భయపడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే పిల్లల చేతుల్లోని బ్యాగులను కూడా కోతులు వదిలిపెట్టడం లేదు. దాంతో విద్యార్థులు బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు. కూరగాయలు, పండ్లు, వంట సామగ్రిని ఎత్తుకెళ్తున్నాయని మహిళలు చెబుతున్నారు.

నగరంలో ఎక్కడెక్కడంటే..

వరంగల్ నగరంలోని గిర్మాజీపేట, గోవిందరాజుగుట్ట, చౌర్‌బౌళి, మట్టెవాడ, పిన్నావారి వీధి, ఎల్లం బజారు, మండిబజారు, పాపయ్యపేట, పోతననగర్, ఎల్‌బీనగర్, కాశిబుగ్గ, అబ్బనికుంట, చింతల్, శివనగర్, కరీమాబాద్, ఎస్ఆర్ఆర్‌తోట, రామన్నపేట, హనుమకొండలోని కాకాజీకాలనీ, పింజర్ల వీధి, శ్రీనివాసా కాలనీ, పద్మాక్షి కాలనీ, నాగుల వీధి, రాయపురా, నాగేంద్రనగర్, ములుగు రోడ్డు, కాజీపేట, మడికొండ వంటి పలు కాలనీల్లో కోతులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోతుల సమస్యపై ప్రజారోగ్య విభాగం అధికారిని వివరణ కోరగా టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే కోతులను పట్టుకునేందుకు చర్యలు వేగవంతం చేస్తామన్నారు.

కోతులను పట్టుకొని అడవులకు తరలిస్తాం

నగరంలో కోతుల బెడద ఉంది. నగరవాసుల ఫిర్యాదు మేరకు కోతులను పట్టుకొని అడవులకు తరలిస్తాం. అందుకు కాంట్రాక్టు ప్రక్రియ కూడా పూర్తయింది. వీలైనంత తొందరలో కోతులను పట్టుకునేందుకు తగు చర్యలు తీసుకుంటాం. ప్రజలకు వానరాల బెడద నుంచి విముక్తి కలిగిస్తాం.

- రాజేష్, సీహెచ్ఓ

న్యూశాయంపేటలో బీభత్సం



న్యూశాయంపేటలో తిరుగుతున్న కోతులు



కాజీపేట అర్బన్: 31వ డివిజన్‌లోని న్యూశాయంపేటలో కోతులు బీభత్సం సృష్టిస్తున్నాయి. న్యూశాయంపేటలోని ఇళ్లు, దుకాణాల్లోకి గుంపులుగా చొరబడుతూ వస్తువులను చెల్లాచెదురు చేస్తున్నాయి. అడ్డువచ్చిన వారిపై దాడులకు దిగుతున్నాయి. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా అందరిని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇళ్లలోకి దూరి ఏది దొరికితే దాన్ని ఎత్తుకెళ్తున్నాయి. పప్పులు, ఉప్పులను చిందరవందర చేస్తున్నాయి. కర్ర లేనిదే బయటి వెళ్లేందుకు స్థానికులు జంకుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకుని కోతుల బారి నుంచి తమను రక్షించాలని స్థానికులు వేడుకుంటున్నారు.

మృతుడి కుటుంబానికి స్నేహితుల చేయూత



డిపాజిట్ బాండ్‌ను అందజేస్తున్న మిత్రులు

మడికొండ: 45వ డివిజన్ తరాలపల్లి గ్రామానికి చెందిన అమ్మగారి రమేష్ టీఎస్ ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ సంస్థలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తుండేవాడు. రెండు నెలల క్రితం అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. దాంతో బాధిత కుటుంబానికి మృతుడి చిన్ననాటి స్నేహితులు రూ.55,500లను పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ బాండ్‌ను కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. రమేష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అంకేశ్వరపు శ్రీనివాస్, వేల్పుల సాంబరాజు, కన్ని, కొత్తపెల్లి వేణు, నవీన్‌కుమార్, మలిశెట్టి రాధాకృష్ణ, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఐనవోలు: మండలంలోని పంథిని గ్రామానికి చెందిన తరాల ఎల్లయ్య ఇటీవల అనారోగ్య కారణాలతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గ్రామ మాజీ సర్పంచ్ బరిగల సదానందం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. ఉప్పరి కొమ్మాలు, కొలిపాక రాజు, ఉప్పరి రాజు, నస్కూరి సారయ్య, ముంజ భిక్షపతి, ముంజ ఉప్పలయ్య, కొత్తూరి బాబు, బూస మల్లయ్య, ఎల్లేశం, జన్ను సురేష్, దాట్ల మహేష్ ఉన్నారు.

ఆశీర్వదించండి.. సేవ చేస్తా



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు



దేశాయిపేట: పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రదీప్‌రావు

- బీజేపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు
- పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

కాశిబుగ్గ: ఈ ఎన్నికల్లో తనను ఆదరించి ఆశీర్వదిస్తే నిత్యం అందుబాటులో ఉండి ప్రజాసేవ చేస్తానని బీజేపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. క్రిస్టియన్‌కాలనీ, లేబర్‌కాలనీల్లోని పలు చర్చిలను ప్రదీప్‌రావు ఆదివారం సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ల నుంచి ఆశీర్వాదాలు అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా ప్రతిఒక్కరూ తనను ఆదరించే తీరు బాగుందని సంతోషం వ్యక్తం చేశారు. ప్రభువు దయ, ప్రజల దీవెనలతో ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంబడి బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

తూర్పు అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించాలి

దేశాయిపేట: వరంగల్ తూర్పు నియోజకవర్గ అభివృద్ధి కోసం బీజేపీ గెలిపించాలని ఆ పార్టీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. 12వ డివిజన్ డాక్టర్స్‌కాలనీలో మంత్రి రమణారావు ఆధ్వర్యంలో వివిధ పార్టీల నుంచి పలువురు నాయకులు శనివారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి ప్రదీప్‌రావు ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి పార్టీలో చేరుతున్నారని చెప్పారు. తూర్పు నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగురవేసేందుకు ప్రజలు అనుకూలంగా ఉన్నారని తెలిపారు. తన గెలుపు ఇక తథ్యమని ప్రదీప్‌రావు అన్నారు.

బీఆర్ఎస్ పార్టీ కాదు.. ఓ కుటుంబం



వరంగల్ : ఏనుమాములలో ప్రచారం చేస్తున్న అరూరి రమేష్



హసన్‌పర్తి: గడపగడపకు ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేష్

వరంగల్: బీఆర్ఎస్ అంటే పార్టీ కాదని, ఒక కుటుంబం అని ఆ పార్టీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. కాంగ్రెస్ నీచ రాజకీయాలకు చరమగీతం పాడే రోజు దగ్గర పడిందని అన్నారు. గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ కార్పొరేటర్ తూర్పాటి సులోచన, మాజీ కార్పొరేటర్ సారయ్యను కాంగ్రెస్ నాయకులు ప్రలోభాలకు గురిచేసి టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేర్పించారు. అరూరి రమేష్ సమక్షంలో ఆదివారం మళ్లీ వారు సొంత పార్టీలో చేరారు. ఈ క్రమంలో వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఈనెల 30న జరగనున్న ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తమ ఓటుతో సరైన బుద్ధి చెబుతారని, బీఆర్ఎస్ నాయకులను భారీ మెజార్టీతో గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు.

14వ డివిజన్‌లో ప్రచారం

14వ డివిజన్‌లో ప్రచారం చేపట్టిన రమేష్‌కు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనను గజమాలతో సన్మానించారు. డివిజన్‌లో ఏనుమాముల, సుందరయ్యనగర్, ఎన్‌టీఆర్‌నగర్, మణికంఠ కాలనీల్లో ప్రచారం నిర్వహించగా, మహిళలు బతుకమ్మలతో రమేష్‌ను స్వాగతించారు. మహిళలతో కలిసి రమేష్.. బతుకమ్మ, కోలాటం ఆడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందించిన సంక్షేమ ఫలాలతో తన గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నర్సింహ, రాజశేఖర్, పత్రి సుభాష్ పాల్గొన్నారు.



పర్వతగిరి : అరూరికి మద్దతు తెలుపుతున్న ముదిరాజ్ కులస్తులు



వర్ధన్నపేట : ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వర్ధన్నపేటలో ఇంటింటి ప్రచారం

వర్ధన్నపేట: వర్ధన్నపేట బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే అరూరి రమేష్ గెలుపు కోసం పట్టణంలో మునిసిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, నాయకులు సిలువేరు కుమారస్వామి, గోధుమల మధుసూదన్, కౌన్సిలర్ మంచాల రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని గతంలో ఏ పార్టీ, ఏ నాయకుడూ చేయలేని అభివృద్ధి కేవలం పదేళ్ల కాలంలో చేసి చూపించిన ఘనత అరూరి రమేష్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎన్నికల సీజన్‌లో వచ్చి పోయే వారు మాత్రమే అని విమర్శించారు. ప్రజల కష్ట సుఖాల్లో అరూరి పాలుపంచుకుంటారని అన్నారు.

1వ డివిజన్‌లో

హసన్‌పర్తి: అరూరి రమేష్ గెలుపు కోరుతూ నాయకులు శనివారం గడపగడపకు ప్రచారం నిర్వహించారు. నగరంలోని 1వ డివిజన్ నారాయణనగర్, మంత్రపురి కాలనీల్లో ప్రచారం సాగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మేనిఫెస్టోలో పొందుపరిచిన పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, మూల దేవేందర్, నంది శ్రీనివాస్, చకిలం చంద్రశేఖర్‌రావు, ఇరుకుల లక్ష్మణ్, దుబ్బల భాస్కర్, శ్రీకాంత్, కోడెల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, ఆత్మ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వీసం సురేందర్‌రెడ్డి, చకిలం రాజేశ్వర్‌రావు, నాయకులు పెద్దమ్మ శ్రీనివాస్, అర్జున్, గిన్నారపు రవీందర్, జన్ను కిషన్ పాల్గొన్నారు.

అరూరికి ముదిరాజ్ కులస్తుల మద్దతు

పర్వతగిరి: మండలంలోని కొంకపాకకు చెందిన ముదిరాజ్ కులస్తులు అరూరి రమేష్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ మేరకు హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లో అరూరిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి విజయానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో యుగేందర్‌రావు, మోహన్‌రావు, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు దుర్గయ్య, ఉపాధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

పద్మశాలీలు రాజకీయ శక్తిగా ఎదగాలి



వనభోజన మహోత్సవానికి హాజరైన పద్మశాలి సంఘం ప్రతినిధులు

ఖిలా వరంగల్: పద్మశాలీలు తమ వైభవాన్ని చాటుతూ పార్టీలకు అతీతంగా సంఘటితమై సామాజిక, ఆర్థిక, రాజకీయ శక్తిగా ఎదగాలని పద్మశాలి సంఘం గౌరవ జిల్లా అధ్యక్షుడు కుసుమ సతీష్ సూచించారు. కార్తీకమాసం వన మహోత్సవం సందర్భంగా కాకతీయుల రాజధాని ఖిలా వరంగల్ కోటలోని క్రీడా మైదానంలో వరంగల్ జిల్లా, పట్టణ పద్మశాలి ప్రతినిధుల ఆధ్వర్యంలో పద్మశాలీల కార్తీక వనభోజన మహోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలీల అభ్యున్నతే లక్ష్యంగా సంఘాలు పనిచేయాలని చెప్పారు. సమష్టిగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం పద్మశాలీలందరూ సామూహికంగా కలిసి భోజనాలు చేశారు. కార్యక్రమంలో వడ్నాల నరేందర్, డీఎస్.మూర్తి, చందర్ బాబు, అశోక్, గోరంటల రాజు, సూర్యనారాయణ, సమ్మయ్య, బైరి శ్యాం, శ్రీధర్, మురళీకృష్ణ, రాకేష్, నిరంజన్, రమేష్, మహేశ్వర్ పాల్గొన్నారు.

హోంగార్డు కుమార్‌కు సన్మానం

పరకాల: 20 సంవత్సరాలుగా రన్నింగ్, వాకింగ్‌తో అనేక మంది యువతకు, స్థానిక ప్రజలకు స్ఫూర్తినిస్తున్నందుకు హోంగార్డు కట్కూరి కుమార్‌ను పరకాల టైగర్ వాకర్స్ క్లబ్ నిర్వాహకులు ఆదివారం సన్మానించారు.

లైంగిక వేధింపులను అరికట్టాలి

నర్సంపేట: ఆడపిల్లలపై జరిగే లైంగిక, ఇతర వేధింపులను సమాజంలోని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించి అరికట్టాలని, వారి హక్కుల కోసం పాటుపడాలని స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్ సూచించారు. పట్టణంలోని విజ్‌డమ్ పాఠశాలలో ఆదివారం ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సహకారంతో స్వయంకృషి సోషల్ వర్క్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ బాలల వేధింపుల నివారణ దినోత్సవం సందర్భంగా బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలు ధైర్యంగా సమస్యలను ఎదురించే స్థాయికి ఎదగాలన్నారు. ఆడపిల్లలు వేధింపుల సమస్యలకు గురైనప్పుడు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీస్ 100 టోల్‌ఫ్రీ నంబర్లకు ఉచితకాల్ ద్వారా సమాచారం అందించి సహాయం తీసుకొని రక్షణ పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ సయ్యద్ జావిద్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాశ్, ఉపాధ్యాయులు, సిబ్బంది, హాస్టల్ బాలికలు తదితరులు పాల్గొన్నారు.

తూర్పు నియోజకవర్గ ప్రచారంలో ఉద్రిక్తత

- కాంగ్రెస్ ప్రచార రథ డ్రైవర్‌పై దాడి.. పార్టీ జెండాల తొలగింపు
- ఘర్షణ పడిన ఇరువర్గాలను చెదరగొట్టిన పోలీసులు



మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ ఎదుట నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు



నాయకులతో మాట్లాడుతున్న ఏసీపీ కిషన్

ఖిలా వరంగల్: వరంగల్ అండర్ బ్రిడ్జి, ఫోర్ట్‌రోడ్డుపై ఆదివారం సాయంత్రం కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం రథం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రచార రథాన్ని అడ్డగించి డ్రైవర్‌పై దాడి చేసి జెండాలను తొలగించిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ వినయ్ కథనం ప్రకారం.. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొండా సురేఖ ప్రచారం రథం ఆదివారం సాయంత్రం వరంగల్ అండర్ బ్రిడ్జి, ఫోర్ట్ రోడ్డుపై వెళ్తుండగా, మద్యం మత్తులో ఓ వ్యక్తి వచ్చి ఆ రథాన్ని అడ్డుకొని కాంగ్రెస్ జెండాలు తొలగించి, 'మా అడ్డాపై నీపెత్తనం ఎంటిరా' అంటూ డ్రైవర్ వినయ్‌పై దుర్భాషలాడుతూ చేయి చేసుకున్నాడు. ఆ విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు.. ఘటనా స్థలానికి చేరుకున్నారు. దాంతో ఇరు వర్గాల నడమ ఉద్రిక్తత నెలకొంది. ఈక్రమంలో మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ సురేష్ చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. కాంగ్రెస్ ప్రచార రథంతోపాటు డ్రైవర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఎమ్మెల్యే నరేందర్ అనుచరులే తమ డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. వాహనంతోపాటు డ్రైవర్‌ను వదిలేయాలని నినాదాలు చేశారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొండా సురేఖ.. పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఏసీపీ బోనాల కిషన్ స్పందించారు. ప్రచార రథ డ్రైవర్ వినయ్‌పై చేయి చేసుకున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. దాంతో ప్రచారం రథాన్ని తీసుకుని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు మీసాల ప్రకాష్, గజ్జల శ్యామ్, సాగర్ల శ్రీనివాస్, పుప్పాల రాజేందర్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.